నేరాల నియంత్రణకు డేగ కన్ను

- పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 150 సీసీ కెమెరాల ఏర్పాటు
- ప్రధాన కూడళ్లు, మూలమలుపుల వద్ద ఏర్పాటు
- గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న పోలీసులు



కనగర్తిలో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఏసీపీ గజ్జి కృష్ణ (ఫైల్)

ఓదెల: నేరాల నియంత్రణకు, గ్రామాల భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పోలీసు ఉన్నతాధికారులు శ్రీకారం చుట్టారు. ప్రతీ ఇంటికి ఒక సీసీ కెమెరా ఏర్పాటు కోసం పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సెల్ ఫోన్ ఉన్న ఇంట్లో తప్పనిసరిగా సీసీకెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకుంటే ఇంటితో పాటు వస్తువులకు భద్రత ఉంటుందని ఏసీపీ పెద్దపల్లి డివిజన్ పరిధిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు.

మండలంలో 150 సీసీ కెమెరాలు..

మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని 22 గ్రామాల్లో ప్రధాన చౌరస్తాల వద్ద, మూలమలుపుల వద్ద, ఆలయాల సమీపంలో, ప్రధాన రహదారులకు ఇరువైపులా దాదాపు 150 సీసీ కెమెరాలు ప్రజల భాగస్వామ్యంతో పోలీసు అధికారులు ఏర్పాటు చేశారు. కనగర్తిలో 15, పొత్కపల్లిలో 10, గోపరపల్లెలో 5, గుంపులలో 5, ఓదెలలో 7, బీమరిపల్లిలో 3, కొలనూర్‌లో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో బస్టాండు కూడళ్ల వద్ద, రైల్వేస్టేషన్లకు వెళ్లే రహదార్లలో, కళాశాలలకు వెళ్లే మార్గంలో మహిళలకు, విద్యార్థినులకు భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు కోసం స్థలాలను గుర్తించారు.

భద్రత పెరిగింది



పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలతో భద్రత పెరిగింది. సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామాల్లో అవగాహన సదస్సులతో చైతన్యం పెరిగింది. యువత, మహిళలు సీసీ కెమెరాల ఏర్పాటుతో ధైర్యంగా ప్రయాణం చేస్తున్నారు.

– సంపత్‌రెడ్డి, గ్రామస్తుడు, పెద్దకొమిర

ఇంటింటికీ సీసీ కెమెరా



పెద్దపల్లి డివిజన్ పరిధి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటా సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలి. గ్రామాల్లో ఎలాంటి నేరాలు జరిగినా నిమిషాల్లో ఛేదించవచ్చు. 'మీకోసం పోలీసులు, సీసీ కెమెరాల ఏర్పాటు'తో గ్రామాల్లో మంచి ఫలితాలు వస్తున్నాయి.

– గజ్జి కృష్ణ పెద్దపల్లి ఏసీపీ

ప్రజల భాగస్వామ్యంతో..



పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 22 గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం కసరత్తు చేస్తున్నాం. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం పోలీస్‌స్టేషన్ పరిధిలో 150 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నాం.

– రమేశ్, ఎస్సై, పొత్కపల్లి

క్లుప్తంగా

మున్సిపల్ అభివృద్ధికి సహకరిస్తాం



సన్మానిస్తున్న బిరుదు సమత

సుల్తానాబాద్: మున్సిపల్ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తామని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బిరుదు సమత అన్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్‌ను కలిసి సన్మానించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సారథ్యంలో మున్సిపల్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ముస్త్యాల రవీందర్, అమిరిశెట్టి తిరుపతి, బిరుదుకృష్ణ, సాంబయ్య ఉన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

ధర్మారం: మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్‌శెట్టి ఆధ్వర్యంలో బుధవారం కాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. వివిధ కళాశాలల విద్యార్థులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్న ఈ ర్యాలీ అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఆర్టీసీ బస్టాండ్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా క్యాన్సర్ నివారణకు ప్రతీఒక్కరు కృషిచేయాలని నినాదాలు చేశారు. ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతీఒక్కరు పాటు పడాలని ఆయన సూచించారు. మండల వైద్యాధికారి అనుదీప్, ఎస్సై శీలం లక్ష్మణ్, మండల విద్యాధికారి ప్రభాకర్, ఏఈ రాజశేఖర్, లయన్స్‌క్లబ్ రీజనల్ చైర్మన్ రాజేందర్, జోన్ చైర్మన్ కామని శ్రీనివాస్, జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ ఎల్లారెడ్డి, రీజినల్ సెక్రటరీ మునీందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఇప్ప మల్లేశం, కార్యదర్శి ముజాహిద్, కోశాధికారి కట్ట రమేశ్, క్లబ్ సభ్యులు వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సత్యనారాయణరెడ్డి

ధర్మారం: మండలంలోని నర్సింగపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గుండ సత్యనారాయణరెడ్డి బుధవారం బీజేపీలో చేరారు. పెద్దపల్లి బీజేపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జుల వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. సత్యనారాయణరెడ్డితో పాటు అదే గ్రామానికి చెందిన చేపూరి వీరేశం, గుండ సతీశ్‌రెడ్డి, వడుకాపూర్ సాయికిరణ్, గుండ శ్యాంప్రసాద్‌రెడ్డి పార్టీలో చేరారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు



వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న అధికారులు

ఎలిగేడు: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో ఆరిఫ్ తెలిపారు. మండలంలోని ముప్పిరితోటలో బుధవారం తాగునీటి ఎద్దడి నివారణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రక్షిత మంచినీటి బావి, వాటర్ ట్యాంకులు, బోర్‌బావులను పరిశీలించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా యాక్షన్‌ప్లాన్ తయారు చేసి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



ఓదెల: మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంపులలో ఏఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. గుంపుల రామభద్ర వంతెన మీదుగా జమ్మికుంట, కాల్వశ్రీరాంపూర్ వైపులకు వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

నాలుగు లేబర్ కోడ్‌లు వెనక్కి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

గోదావరిఖని: నాలుగులేబర్ కోడ్‌లు, మూడు రైతు నల్ల చట్టాలను వెనక్కి తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మేర్గు చంద్రయ్య డిమాండ్ చేశారు. ఎస్‌కేఎం జాతీయ కార్యవర్గం ఇచ్చిన పిలుపు మేరకు ఐఎఫ్‌టీయూ, అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా కమిటీల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పైలాన్ చౌరస్తాలో నిరసన తెలిపారు. నాయకులు వెంకన్న, నరేశ్, అశోక్, మల్లేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

వెరిఫికేషన్ లేకుండా గేట్‌పాస్‌లు పునరుద్ధరించాలి



నిరసనలో జేఏసీ నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికులకు పోలీస్ వెరిఫికేషన్ లేకుండా గేట్ పాస్‌లు పునరుద్ధరించాలని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల (జేఏసీ) నాయకులు డిమాండ్ చేశారు. ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో బుధవారం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. ఇన్సూరెన్స్ రంగంలోని ఎఫ్‌డీఐలను 100శాతం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం యాజమాన్యం 2018, 2022లో చేసుకున్న ఒప్పందం పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. కార్మికులకు ఆరునెలల గేట్ పాస్‌లు అందించాలన్నారు. జేఏసీ నాయకులు నాంసాని శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి, దండ రాఘవరెడ్డి, నాగభూషణం, ఇజ్జగిరి భూమయ్య, రాధారపు రాజమల్లయ్య, ఆలేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్కేటింగ్ చాంపియన్స్‌కు స్వాగతం



స్వాగతం పలుకుతున్న కందుల సంధ్యారాణి

గోదావరిఖనిటౌన్: తమిళనాడులోని మధురైలో ఇటీవల నిర్వహించిన నేషనల్ స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రం నుంచి పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను బుధవారం గోదావరిఖనికి వచ్చిన సందర్భంగా బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ప్రాంతం స్టేట్ సెక్రటరీ తరుణ్ కిషోర్, ఎస్‌టీకే అకాడమీ కోచ్ రామ్ విఘ్నేష్ ఆధ్వర్యంలో శ్రీనిధి, గీతిక్, సాయి రశిత గోల్డ్ మెడల్స్, సహస్ర, అక్షయ సాయి, హన్నా, అకీరా నందన్, సాయి రశిత బ్రౌన్ మెడల్స్ సాధించారని ఆమె తెలిపారు. వీరిలో అకీరా నందన్, సాయి రశిత విద్యార్థులు ఇంటర్నేషనల్ స్థాయికి ఎంపిక కావడం గర్వకారణమని ఆమె కొనియాడారు. బీజేపీ నాయకులు మేరుగు హన్మంత్‌గౌడ్, కోమళ్ల మహేశ్, కుర్ర రాజేందర్, రాకేశ్, ప్రవీణ్, అపర్ణ, పద్మ, మచ్చ విశ్వాస్ పాల్గొన్నారు.

క్రీడలతో పోటీతత్వం పెరుగుతుంది



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీమణి, చైర్మన్

రామగుండం: క్రీడలతో యువతలో పోటీతత్వం పెరుగుతుందని, ఫలితంగా గ్రామీణ యువత సన్మార్గంలో నడిచే అవకాశం ఉంటుందని రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ గాలిపెల్లి తిరుపతి, ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్ అన్నారు. బుధవారం అంతర్గాం మండల పరిధిలోని రాయదండిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మసూద్ స్మారకార్థం ఏర్పటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రతినిధులు ఎండీ.గౌస్‌బాబా, ప్రేమ్, చింటూ, రవి, మెరాజ్, నరేశ్ ఉన్నారు.

అధ్యయన మహోత్సవాలు ప్రారంభం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్‌లో ఆలయ బ్రహ్మోత్సవ అధ్యయన మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి పర్మినెంట్ టౌన్‌షిప్ వైకుంఠపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మోక్షోత్సవం ఆలయ అర్చకులు శ్రీమాన్ వానమామలై రామాచార్యులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కృష్ణమాచార్యులు, భరద్వాజ్, శ్రీధర్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• కార్మిక, వ్యవసాయ రంగాలను పట్టించుకోని కేంద్రం

యైటింక్లయిన్‌కాలనీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కార్మిక, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వలేదని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అశోక్ ఆరోపించారు. ఎస్‌కేఎం జాతీయ కార్యవర్గం ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం యైటింక్లయిన్‌కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రమేశ్, దుర్గంబాబు, దుర్గేశ్, రాజబాబు, శంకరమ్మ, సమ్మయ్య, నాగేష్, లక్ష్మి, రాజమ్మ, సంపత్, జలపతి నాయక్, కుమారి, నవీన్, వీరస్వామి, మహేందర్ పాల్గొన్నారు.

• పెద్దపల్లి తహసీల్దార్ బాధ్యతలు స్వీకరణ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి తహసీల్దార్‌గా రాజయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ విజేందర్, ఆర్ఐ రాజిరెడ్డి, భానుకుమార్ పుష్పగుచ్ఛం అందించారు.

• సుల్తానాబాద్ తహసీల్దార్..

సుల్తానాబాద్: సుల్తానాబాద్ తహసీల్దార్ రాంచందర్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ ఉద్యోగులు స్వాగతం తెలిపి పుష్పగుచ్ఛం అందించారు. కార్యాలయంలో గదులను, రికార్డు రూమ్‌తో పాటు, నాయబ్ తహసీల్దార్, బి సెక్షన్ ధరణి ఆపరేటర్ రూమ్‌ను పరిశీలించారు. నాయబ్ తహసీల్దార్ రాకేశ్, ఆర్ఐలు వినోద్, వినయ్‌కుమార్, సుకుమార్, రాజేందర్, జ్యోతి ఉన్నారు.

• కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్..

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్‌గా జగదీశ్వర్‌రావు బాధ్యతలు స్వీకరించారు.

• మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

మంథని: చలో సెక్రటేరియట్ సందర్భంగా బుధవారం మంథని మండలంలోని పలువురు మాజీ సర్పంచ్‌లను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమకు రావాల్సిన బిల్లుల కోసం పోరాటం చేస్తుంటే అరెస్టు చేయడం సరికాదన్నారు.

• సావిత్రీబాయి పూలే అవార్డుకు మౌనిక ఎంపిక

గోదావరిఖనిటౌన్: పదేళ్లుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నగరానికి చెందిన కంకణాల మౌనికను భారతీయ దళిత సాహిత్య అకాడమీ సావిత్రీబాయి పూలే ఫెలోషిప్ అవార్డుకు ఎంపిక చేసినట్టు డాక్టర్ పసుల రామ్మూర్తి తెలిపారు. అవార్డు ఎంపికకు కృషి చేసిన రామ్మూర్తికి ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

• పేదలకు అండగా కేంద్ర బడ్జెట్

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం బెడ్జట్‌లో పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి నిధులు కేటాయించిందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేశ్, మండల అధ్యక్షుడు వేల్పుల రమేశ్ అన్నారు. పెద్దపల్లిలోని జెండా కూడలిలో బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ చిత్రపటాలకు వారు క్షీరాభిషేకం చేశారు. నాయకులు తంగెడ రాజేశ్వర్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, రాజ్‌గోపాల్, కందుల శ్రీనివాస్, ఉప్పు కిరణ్, శ్రీకాంత్, సతీశ్, వంశీ, శ్రీధర్, పిట్టల వినయ్, సోడాబాబు, ఉమేశ్, యాంసాని వేణు, సురేందర్, ప్రశాంత్ ఉన్నారు.

• కేంద్ర మంత్రులకు క్షీరాభిషేకం

జూలపల్లి: మండల కేంద్రంలోని బస్టాండు వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. పార్టీ నాయకులు గుడిపాటి సంతోష్‌రెడ్డి, బుసారపు రవీందర్‌గౌడ్, కోడూరి రాజేశ్వర్, పెద్దోల్ల ఐలయ్య, మోహన్‌రెడ్డి, బొజ్జ సంపత్, దాడి రవీందర్, లక్ష్మన్, శ్రీకాంత్ ఉన్నారు.

• సీఎం, మంత్రి చిత్రపటాలకు..

మంథని: ఎస్సీ వర్గీకరణను ఆమోదించి మాదిగ ఉప కులాలకు 9శాతం రిజర్వేషన్ కేటాయించినందుకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో బుధవారం మంథని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాకుడు మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు మంథని రాకేశ్, డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కపాక శంకర్, నాయకులు బూడిద తిరుపతి, తోకల మల్లేశ్, రాజు ఉన్నారు.

• ఆయన నేత్రాలు సజీవం

రామగిరి: మండలంలోని కల్వచర్లకు చెందిన జాపతి రాజయ్య(70) బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. రాజయ్య నేత్రాలను దానం చేయాలని లయన్స్ క్లబ్ డైరెక్టర్ ఉమ్మడి కమాన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి మృతుడి కుటుంబానికి అవగాహన కల్పించగా రాజయ్య నేత్రాలను దానం చేయడానికి అంగీకరించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తికి సమాచారం అందించారు. కరీంనగర్ నుంచి టెక్నీషియన్ ప్రదీప్ లయన్స్ క్లబ్ సెంటినరికాలనీ సభ్యుడు మేకల మారుతియాదవ్ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి హైదారాబాద్‌కు తరలించారు.

• అప్రమత్తతతోనే నేరాల నియంత్రణ

జ్యోతినగర్: ప్రజల అప్రమత్తతతోనే నేరాలు నియంత్రించవచ్చని ఎన్టీపీసీ ఎస్సై టి.ఉదయ్‌కిరణ్ అన్నారు. స్టేషన్ పరిధిలోని అన్నపూర్ణకాలనీలో బుధవారం రాత్రి పోలీసు కళాబృందం ప్రదర్శనలో భాగంగా ఆయన మాట్లాడారు.

చెక్‌డ్యాముల నిర్మాణం కోసం సర్వే



పేంచికల్‌పేట శివారులోని వాగుపై సర్వే చేస్తున్న సిబ్బంది

కమాన్‌పూర్: మండలంలోని పేంచికల్‌పేట శివారు వాగులో సింగరేణి సంస్థ ఆర్జీ–2 ఆధ్వర్యంలో నిర్మించనున్న చెక్ డ్యాముల నిర్మాణం కోసం బుధవారం ఇరిగేషన్ అధికారులతో సర్వే పనులు చేపట్టారు. సింగరేణి ప్రభావిత గ్రామ శివారులోని సాగు చేసే పంటలకు సాగునీరు అందించడానికి వాగులపై చెక్ డ్యాములు నిర్మించాలని గ్రామానికి చెందిన పల్లె నారాయణ ఇటీవల సింగరేణి అధికారులకు విన్నవించారు. కాగా సింగరేణి అధికారులు చెక్‌డ్యాముల ఏర్పాటు కోసం సర్వే చేయిస్తున్నారు.

సింగరేణి వార్తలు

కార్మిక పిల్లల పోరాటానికి అండగా ఉంటాం



పాదయాత్రకు మద్దతు తెలుపుతున్న పుట్ట మధు

మంథని: సింగరేణి కార్మిక పిల్లల న్యాయమైన పోరాటానికి అండగా ఉంటామని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మారుపేర్లతో ఉన్న సింగరేణి కార్మికుల పిల్లలు న్యాయం కోసం గోలేటి నుంచి కొత్తగూడెం వరకు చేపట్టిన పాదయాత్ర బుధవారం మంథనికి చేరుకుంది. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో పుట్ట మధు వారికి స్వాగతం పలికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సంస్థలో ఎవరో క్లర్క్ చేసిన తప్పునకు సింగరేణి కార్మికుల పిల్లలు భరించడం అన్యాయమన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన సభలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ సమస్య పరిష్కరిస్తామని మాట ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కార్మికుల పక్షాన నిలబడి పోరాటం చేయాల్సిన ఎర్రజెండా పార్టీలు ఈ విషయంపై నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు చేపట్టండి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న మహేశ్

రామగిరి: మండలంలోని పన్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలని బుధవారం ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావుకు మాజీ ఎంపీటీసీ చిందం మహేశ్ వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ పరిధిలోని పన్నూర్, సెంటినరికాలనీ జోన్–1, 2, వకీల్‌పల్లి, టీటూ, సీటూ, శ్రీలంక క్వార్టర్లలో దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జీఎం దృష్టికి తీసుకెళ్లారు. జీఎం సానుకూలంగా స్పందించి కాలనీ పరిసర ప్రాంతాల్లో త్వరలోనే ఫాగింగ్ చర్యలు చేపడుతామని తెలిపినట్లు మహేశ్ చెప్పారు.

గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం శిక్షణ



శిక్షణ ఇస్తున్న ఎస్సై జనార్దన్‌రెడ్డి

ధర్మారం: మండలంలో వివిధ గ్రామాలకు చెందిన గీత కార్మికులకు ఎక్సైజ్ ఎస్సై జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కాటమయ్య రక్షణ కవచం శిక్షణ ఇచ్చారు. మండలంలోని సాయంపేట, గోపాల్‌రావుపేట, మేడారం గ్రామాలకు చెందిన దాదాపు 50మంది గీత కార్మికులకు శిక్షణ ఇచ్చినట్లు ఎస్సై పేర్కొన్నారు. వీరందరికీ త్వరలోనే సెఫ్టీ కిట్లు అందజేస్తామన్నారు. ఈ శిక్షణతో గీత కార్మికులు ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద పడినా ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రైనర్ మూల మల్లేశం, ఇల్లందుల అంజిబాబు, బత్తిని శ్రీనివాసులు, సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకరయ్య, మండల అధ్యక్షుడు పంజాల రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల కూలీ రేట్లు పెంచాలి

గోదావరిఖని: స్థానిక కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీ కార్మికుల కూలీ రేట్లు పెంచాలని కరీంనగర్‌లో ఉన్న డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కరీంనగర్‌లోని ఆయన కార్యాయలంలో బుధవారం కలిసి సమస్యలు వివరించారు. గోదావరిఖని కూరగాయల మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎంఏ గౌస్ మాట్లాడారు. గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో 35ఏళ్లుగా దాదాపు 60 మంది కార్మికులు హమాలీ వర్కర్లుగా పని చేస్తున్నారని, వారికి ప్రతీ రెండేళ్లకు ఒకసారి హోల్‌సేల్ వ్యాపారులు కూలీ రేట్లు పెంచే ఆనవాయితీ ఉందన్నారు. ప్రస్తుతం వీరి కూలీ రేట్ల పెంపు కాలపరిమితి 2019తో ముగిసిందని అయినా పెంచడంలేదన్నారు. హమాలీ వర్కర్స్‌కు కూలీ రేట్లు పెంపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, గడ్డం రాంచందర్, గాలిపెల్లి సతీశ్, బండారి రవి, ఆవుల ఐలయ్య, జానీమియా తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



గోదావరిఖని: సంబరాల్లో నాయకులు



రామగుండం: అంతర్గాం జంక్షన్‌లో సంబరాలు

గోదావరిఖని: ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదించడాన్ని హర్షిస్తూ 'ఖని' ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు బుధవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. మాజీ మేయర్ బంగి అనిల్‌కుమార్, నాయకులు మహంకాళి స్వామి, దీటి బాలరాజు, కొలిపాక సుజాత, మల్లయ్య, పాతపల్లి ఎల్లయ్య, ముస్తఫా, గట్ల రమేశ్, పులేందర్, దొంత శ్రీనివాస్, బాలరాజు, పెద్దెల్లి ప్రకాశ్, యుగంధర్, సాంబమూర్తి, దూళికట్ట సతీశ్, కౌటం సతీశ్, దాసరి విజయ్, నజీముద్దీన్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు ముందు ఇచ్చిన మాట ప్రకారం బీసీ కులగణన బిల్లు, ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల బిల్లు సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సమావేశంలో ప్రవేశపట్టిన సందర్భంగా కాలనీ కాంగ్రెస్ నాయకులు బుధవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. కాలనీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు మెరుగు రాజేశం, కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, మాజీ కార్పొరేటర్ సాగంటి శంకర్, సదానందం, దేవనపల్లి చక్రపాణి, మార్కరాజు, రాములు, తిరుపతిరెడ్డి, సారయ్య నాయక్, కిషన్ నాయక్, శ్రీనివాస్, రాకేశ్, అవినాష్ పాల్గొన్నారు.

రామగుండం: అంతర్గాం జంక్షన్‌లో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించి మిఠాయిలు పంచిపెట్టారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, పార్టీ అంతర్గాం మండల ఇన్‌చార్జి పెంద్రు హనుమాన్‌రెడ్డి, ఉరిమెట్ల రాజలింగం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడ్డి తిరుపతిగౌడ్, రెండు మండలాల కోఆర్డినేటర్ గాదె సుధాకర్, సత్యయ్యగౌడ్, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, కొమురెల్లి, గుంట లక్ష్మణ్, బాపు, బర్పటి తిరుపతి ఉన్నారు.

జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్ ఉండాలి

సుల్తానాబాద్: జనాభా దామాషా ప్రకారంగా వెనుకబాటు ఆధారంగా ఏవిధంగా చూసినా మాదిగలకు దక్కాల్సిన వాటా దక్కలేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గుండా థామస్ ఆరోపించారు. మండల కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 7న జరిగే వేల గొంతులు లక్షల డప్పుల మహా ప్రదర్శన తాత్కాలికంగా వాయిదా పడిందని, త్వరలోనే తేదీ ప్రకటిస్తామని తెలిపారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తిప్పారపు లక్ష్మణ్ ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు శంకర్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చంద్రమౌళి, లక్ష్మణ్, రాజేశం, నాంపల్లి, మలేక్‌బాయ్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం విద్యావంతులైన యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామంటూ మోసపూరితమైన హామీలు ఇచ్చిందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శులు జ్యోతి, రవీందర్ అన్నారు. పెద్దపల్లిలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నాయకులు సాగర్, మరియ, కొండయ్య, కొమురయ్య, రాజేశం, రాజేశ్వరి, సతీశ్, శంకరయ్య, అన్వేష్, లక్ష్మి ఉన్నారు.